# వైభవంగా శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం



సిర్పూర్ (టీ) : మండలకేంద్రంలో నిర్వహించిన రథోత్సవానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

- భక్తజన సంద్రంగాం రథోత్సవం
- ప్రత్యేక ఆకర్షణగా డప్పు చప్పుళ్లు.. ఒగ్గు కళాకారుల నృత్యాలు

సిర్పూర్(టీ), అక్టోబర్ 24 : మండలకేంద్రంలో విజయదశమి (దసరా) పండుగ వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ఆలయ, హిందూ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కన్నుల పండువుగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామి వారిని ఊరేగించే రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణ మహోత్సవ నిర్వహించారు.

### భక్తజన సంద్రంగా రథోత్సవం..

వేంకటేశ్వర ఆలయం నుంచి పలు వీధుల గుండా డౌనల్ ప్రాంతం వరకు ఒగ్గుడోలు కళాకారులు,గోదావరిఖనికి చెందిన డప్పు రమేశ్ ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ళ నడుమ రథోత్సవాన్ని నిర్వహించారు. అలాగే పట్టణంలోని పాతట్లగూడ ఎల్లమ్మ ఆలయంలో ఉప సర్పంచ్ తోట మహేశ్, ఎస్ఐ రమేశ్‌తో పాటు భక్తులు శమీ పూజ నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని డౌనల్ ప్రాంతంలోని వాగులో కౌటాల సీఐ సాదీక్‌పాషా, సిర్పూర్(టీ) ఎస్ఐ రమేశ్‌తో రావణ దహణ కార్యక్రమాన్ని చేపట్టారు. దసరా వేడుకలకు సహకరించిన పోలీసు బృందానికి కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. కౌటాల సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేశ్, ఇతర మండలాల ఎస్ఐలు బందోబస్తును నిర్వహించారు.



కాగజ్‌నగర్ : త్రిశూల్ పహాడ్‌పై జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు

### త్రిశూల్ పహాడ్‌పై దసరా వేడుకలు...

కాగజ్‌నగర్, అక్టోబర్ 24: పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై దసరా వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవి దంపతులు త్రిశూల్ పహాడ్‌పై శమీ పూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధితో కలిసి ఎమ్మెల్యే రావణాసుర బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సిర్పూర్(టీ) : మండలకేంద్రంలో కవాత్ నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణాకర్, పోలీసులు, కేంద్ర బలగాలు

- కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్
- కేంద్ర బలగాలతో కలిసి సిర్పూర్(టీ), కౌటాల మండలకేంద్రాల్లో కవాతు

సిర్పూర్(టీ), అక్టోబర్ 24 : సిర్పూర్(టీ) నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ కోరారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి డౌనల్ ప్రాంతం వరకు రాష్ట్ర, కేంద్ర బలగాలతో కలిసి మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సాదీక్‌పాషా, సిర్పూర్(టీ) ఎస్ఐ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### కౌటాల మండలకేంద్రంలో..

కౌటాల, అక్టోబర్ 24: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి కంకలమ్మ గుట్ట రోడ్డు వరకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కవాత్ నిర్వహించారు. కౌటాల సీఐ సాదీక్ పాషా, ఎస్ఐలు మధూకర్, రమేశ్, పోలీసులు ఉన్నారు.



కౌటాల: కౌటాల మండల కేంద్రంలో..

## ముగిసిన శరన్నవరాత్రులు

దహెగాం, అక్టోబర్ 24 : మండలంలో శరన్నవరాత్రులు మంగళవారం ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు పూజలు అం దుతున్న దుర్గాదేవికి చివరిరోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యువతులు కోలాటాలు, నృత్యాలు నడు మ అమ్మవారిని తీసుకెళ్లి సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

మండలకేంద్రంలోని దుర్గామాతను శోభాయాత్రగా తీసుకెళ్తున్న భక్తులు



## జిల్లాస్థాయి యోగా పోటీలు



పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

కాగజ్‌నగర్, అక్టోబర్ 24 : పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ విద్యాలయంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 బాలబాలికల జిల్లాస్థాయి యోగా పోటీలు మంగళవారం నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఆదిలాబాద్ జిల్లాలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ సాంబశివరావు తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ సెక్రెటరీ అలేఖ్య, జిల్లా కోచ్ ఏడుకొండలు, పతాంజలి జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వరి, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యాసాగర్, కృష్ణప్రసాద్, తిరుపతి, స్వప్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నగదు స్వాధీనం



పట్టుకున్న నగదుతో ఎస్ఐ, సిబ్బంది

సిర్పూర్(టీ), అక్టోబర్ 24 : మండలంలోని హడ్కులీ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన ఆసిఫ్ ఖాన్ నుంచి రూ 84 వేలు పట్టుకొని చేసుకోని సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. రూ. 50 వేలకు మించి నగదు ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను ప్రజలు తమ వెంట ఉంచుకోవాలని ఎస్ఐ సూచించారు.

### ఆయుధపూజ..

సిర్పూర్(టీ), అక్టోబర్ 24 : మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు.

## ఘనంగా ధమ్మచక్ర పరివర్తన్ దివస్

బెజ్జూర్, అక్టోబర్ 24 : మండలకేంద్రంతో పాటు కుకుడ, మర్తిడి, సలుగుపల్లి, సులుగుపల్లి, లుంబినీనగర్, పోతెపల్లి, బారెగూడ, పాపన్‌పేట, సోమిని, కాటేపల్లి తదితర గ్రామాల్లో ధమ్మచక్ర పరివర్తన్ దివస్ వేడుకలను అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు తీశారు. అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు పంచశీల్ జెండాలను ఆవిష్కరించి అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బుద్ధ వందనం ఆలపించారు. అనంతరం అన్నదానాలు చేపట్టారు.



బుద్ధ విహార్ వద్ద పంచశీల్ జెండాను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వాసుదేవ్